క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎలక్ట్రికల్, ఫిట్టర్, వెల్డింగ్, మెకానిక్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్ కోర్సులకు గాను మే 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఏదైనా ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 7569062449ను సంప్రదించాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

పార్వతీపురం: బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని బాల్య వివాహాల నిర్మూలన ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ పి.రాజశేఖర్ అన్నారు. యాక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్ట్ ఆఫ్ హోల్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిరోధం, నివారణ కోసం మత పెద్దలతో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 416 జిల్లాల్లో గత రెండేళ్లలో రెండు లక్షలకు పైగా బాల్య వివాహాలను ఆపినట్లు చెప్పారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు శిక్షణ తరగతులు

పార్వతీపురం: పదో తరగతి ఫలితాలలో ఫెయిలైన గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పార్వతీపురంలోని వసతిగృహాలలో సోమవారం నుంచి శిక్షణ నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను కోచింగ్‌కు పంపించాలని పేర్కొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా కోచింగ్, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. బాలుర కోసం గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల.. బాలికల కోసం గిరిజన సంక్షేమ పోస్టుమెట్రిక్ వసతి గృహంలలో కోచింగ్, వసతి కల్పించినట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ సిబ్బందికి సహకరించండి

• ఏఓ అవినాష్



మట్టి సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సహాయకులకు రైతులు సహకరించాలని ఏఓ ఎస్. అవినాష్ కోరారు. మండలంలోని వెంకటాపురంలో ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో సోమవారం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 44 గ్రామాల్లో 1244 నమూనాలు తీయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 182 నమూనాలు తీసినట్లు చెప్పారు. ఎకరం విస్తీర్ణంలో ఎనిమిది చోట్ల మట్టి సేకరించాలని సూచించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పొలాలకు ఏయే ఎరువులు వేయాలో తెలుస్తుందని చెప్పారు.

వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కూలీ సంఘ నాయకులు

సాలూరు రూరల్: మండలంలో నెలకొన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘ నాయకుడు సుకూరు గంగయ్య మాట్లాడుతూ.. అటవీ,బంజరు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

అమ్మవారి పండగలకు శ్రీకారం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామ దేవత ఇప్పల పోలమ్మ, జగన్నాథపురం గ్రామ దేవత ఎర్ర కంచమ్మ పండగలకు పెద్దలు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పొలిమేరలో ఉన్న ఎర్ర కంచమ్మ అమ్మవారిని గ్రామ ప్రజలు, పెద్దలు ఏకమై సోమవారం రాత్రి గ్రామానికి (కొనితెచ్చు) తీసుకువచ్చారు. మేళతాళాలతో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అమ్మవారి ఘటాలతో 40 రోజుల పాటు ఊరేగింపు కార్యక్రమాలు చేపడతామని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. జూన్ 1, 2, 3 తేదీల్లో పండగలు నిర్వహిస్తామన్నారు.



• జిల్లా కేంద్రానికి బస్సులు వేయండి

భామిని మండల కేంద్రం నుంచి పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి బస్సులు నడపాలని సీపీఐ నాయకుడు తోట జీవన్న, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడులు కోరారు. ఇదే విషయమై వారు జిల్లా కేంద్రానికి సోమవారం వెళ్లి, డీపీటీవో ఎస్.సింహాచలంకు వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వేకువజామున వెళ్తే తప్ప రాత్రికి ఇంటికి చేరుకోలేని దుస్థితి ఉందన్నారు. బస్సు సర్వీసులు కల్పిస్తే వేళకు ఇంటికి చేరుకోవచ్చని, పనులు కూడా సకాలంలో చేసుకునేందుకు వీలుంటుందన్నారు. -భామిని



• ధర్నా

సీతంపేట ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఎరుకుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం ధర్నా చేశారు. భామిని మండలం, తాలాడకు చెందిన గొర్లె భీముడు అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అతడి మృతిపై బత్తిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో కనీసం పోలీస్ పికెట్ కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పాలకొండ డీఎస్పీ, ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడతానని పీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు జి.రమణమూర్తి, సీహెచ్ శాంతారావు, జి.మోహన్‌రావు, జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు. -సీతంపేట



• దళితుల ఆందోళన

మండల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ భామిని మండలం, లివిరి గ్రామ దళితులు సోమవారం ఆందోళన చేపట్టారు. వివాదాస్పద డీ-పట్టా భూముల సర్వేకు వస్తామని చెప్పి, అధికారులు రావడం లేదన్నారు. తమ భూములను కొంతమంది ఆక్రమించుకుని రకరకాల తోటలు వేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ భూములు ఎవరివన్న విషయం తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. సర్వే చేయాలని అధికారులను కోరితే వస్తామని తప్పించుకు తిరుగుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కూరంగి మన్మధరావు, అల్లెబోయిన అప్పలనాయుడు, బాధితులు పొట్నూరు బాలు, నానాజీ, చిన్ని, బాబూరావు తదితరులు పాల్గొన్నారు. -భామిని

గరుగుబిల్లి శాఖా గ్రంథాలయంలో చిన్నారులతో ఆటలు ఆడిస్తున్న లైబ్రేరియన్ మధుసూదనరావు



పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో చిన్నారులతో లైబ్రేరియన్ గణేష్‌బాబు



వేసవి వినోదం..విజ్ఞానం



గుమ్మలక్ష్మీపురం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న లైబ్రేరియన్ సుకన్య

వేసవి విజ్ఞాన శిబిరాలు గ్రంథాలయాల్లో సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సెలవుల్లో స్నేహితులతో చక్కర్లు కొట్టడం, ఊర్లు తిరుగుతూ సరదాగా గడపడం వంటివి విద్యార్థులు చేస్తుంటారు. దీంతో పాఠశాలల పునఃప్రారంభం నాటికి చదువుపై అశ్రద్ధ, నిర్లక్ష్యం పెరుగుతాయి. వీటిని అధిగమించేందుకు ఏటా లైబ్రరీల్లో పిల్లలకు వినోదం, విజ్ఞానం పంచేలా ఈ శిబిరాలు నిర్వహిస్తుంటారు. జూన్ 6వ తేదీ వరకు కొనసాగే ఈ శిబిరాల్లో విజ్ఞానం పెంపొందిస్తూనే వినోదం పంచే కార్యక్రమాలుంటాయని, సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్‌లు కోరారు.

-పాలకొండ, కురుపాం నెట్‌వర్క్

డీఎస్సీ నోటిఫికేషన్‌తో గిరిజనులకు అన్యాయం

సీతంపేట: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌తో గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు బిడ్డిక శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎన్నికలకు ముందు జీవో నంబరు 3 స్థానంలో కొత్త జీవో తీసుకువస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీ నెరవేర్చకుండానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల గిరిజనులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో శతశాతం ఉపాధ్యాయ ఖాళీలను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. పీసా అధ్యక్ష, కార్యదర్శులకు అధికారాలు ఇవ్వాలని, 1/70 చట్టం అమలు చేయాలన్నారు. రెట్రో సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో గిరిజనులను కించపరిచేలా హీరో విజయదేవరకొండ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరామర్శ

భామిని: మండలంలోని బత్తిలి గ్రామానికి చెందిన టింగ చిన్నపిల్లమ్మ(78) ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆమె కుమారుడు, కోడలు అయిన ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు, సర్పంచ్ టింగ శాంతికుమారిలను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం కలిసి పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఎమ్మెల్సీ వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి తోట సింహాచలం, ఏఎంసీ మాజీ చైర్మన్ కొవ్వాడ చిరంజీవులు, సర్పంచ్‌లు మజ్జి మోహన్‌బాబు, లోతుగెడ్డ రవికుమార్ తదితరులు ఉన్నారు.



భామిని: బత్తిలి ఎంపీటీసీ అన్నాజీరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి ఈతమానుగూడ ఎంపీటీసీ సభ్యులు ఎస్.ప్రియ గత కొన్నిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి.. సోమవారం ఆ గ్రామానికి వెళ్లి, ప్రియను పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.రాము, ఎస్.మోహన్‌రావు, ఎస్.వెంకి తదితరులు ఉన్నారు.



సీతంపేట: ఎంపీటీసీ ప్రియ ఆరోగ్యం గూర్చి అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సజావుగా ఇంటర్వ్యూలు

సీతంపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు మినీ అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి మండల కేంద్రంలో సోమవారం చేసిన ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. వెంపలగూడ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, రాజుగాడిగూడ పోస్టుకు ఏ ఒక్కరూ దరఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తు చేసుకున్న వారిని మాత్రం ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ ఇంటర్వ్యూ చేసి, అర్హత పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, ఐసీడీఎస్ పీవో పి.రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 33 వినతులు

సీతంపేట: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయి. దోనుబాయి దుర్గమ్మ గుడి నిర్మాణ పనులను అటవీ శాఖ అడ్డుకుంటోందని, చాపరాయిగూడకు సీసీ రోడ్డు నిర్మించాలని, ఎగువదొండమానుగూడ గిరిజనుల తాగునీటి సమస్య పరిష్కరించాలని పలువురు వినతిపత్రాలు సమర్పించగా, వరదగోడ నిర్మించాలని ఎగువ సంకిలి గ్రామస్తులు, గ్రామంలో రచ్చబండ నిర్మించాలని సీదిమానుగూడ గ్రామస్తులు, నాటుకోళ్ల పెంపకానికి రేకుల షెడ్డు నిర్మించాలని దుగ్గి గ్రామానికి చెందిన ఆరిక రవీంద్ర విజ్ఞప్తి చేస్తూ వినతులు ఇచ్చారు.

కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, పీహెచ్‌వో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

సీతంపేట: స్థానిక క్యాంపు కోర్టులో పాలకొండ నుంచి గజపతినగరానికి బదిలీ అయిన జూనియర్ సివిల్ జడ్జి అగ్గాల విజయరాజ్‌కుమార్‌ను న్యాయవాదులు సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మూర శ్యామ్యూల్, న్యాయవాదులు ఎం.సతీష్, కె.స్వామి, కృష్ణారావు, రవి, నాయుడు పాల్గొన్నారు.



జడ్జి విజయరాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

వెయ్యి లీటర్ల బెల్లంఊట ధ్వంసం

జియ్యమ్మవలస: మండలంలోని గడసింగుపురం, చినమేరంగి గ్రామాల్లో శివారు ప్రాంతాల్లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది సోమవారం చేసిన ఆకస్మిక దాడుల్లో మొత్తం వెయ్యి లీటర్ల బెల్లంఊట స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు ఆ శాఖ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే 30 లీటర్ల సారా కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

పాలకొండ రూరల్: మండలంలోని ఓని గ్రామంలో పాలకొండకు చెందిన ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 8 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వినతిపత్రం అందజేత

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): వీఆర్‌ఏల న్యాయమైన డిమాండ్‌ల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీన కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న సామూహిక రాయబారం కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు గరుగుబిల్లి ఈశ్వరరావు.. కురుపాం తహసీల్దారు రమణమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతులు కల్పించాలని, నామినీలుగా ఉన్న వారిని వీఆర్‌ఏలుగా నియమించాలని, అటెండర్, నైట్ వాచ్‌మన్ ప్రమోషన్ కోటాను 20 నుంచి 70 శాతానికి పెంచాలని, అనవసర డ్యూటీలు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



తహసీల్దారు రమణమ్మకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

హోటళ్లు, షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట, భద్రగిరి రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోటళ్లు, షాపుల్లో అసిస్టెంట్ సివిల్ సప్లయి ఆఫీసర్ కిరణ్‌కుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పెట్రోలు, డీజిల్ అమ్మకాలు సహా హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తుండడాన్ని గుర్తించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ఇవే చర్యలు పునరావృతమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఎల్విన్‌పేటలోని ఓ షాపులో తనిఖీలు చేస్తున్న ఏఎస్‌వో కిరణ్‌కుమార్

ఇళ్లు నిర్మించని వారికి మరో అవకాశం

వీరఘట్టం: గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లస్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ వినోద్ తెలిపారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. వీరఘట్టం మేజరు పంచాయతీ ప్రజలకు అచ్చెపువలస వద్ద 333 ఇళ్లస్థలాలను గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే ఇంతవరకు అక్కడ ఏ ఒక్కరూ నిర్మాణాలు చేయలేదన్నారు. వారికి ఎక్కడైనా సొంత స్థలం ఉంటే పీఎంఏవై గ్రామీణ, అర్బన్ పథకాల ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అంతేకాకుండా బీసీ, ఎస్సీ వర్గాల వారికి అదనంగా మరో రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, గదబలకు రూ.1 లక్షలు అందివ్వడం జరుగుతుందన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



ట్రాఫిక్ జామ్ కారణంగా కురుపాం మండల కేంద్రంలో నిలిచిన వాహనాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో సోమవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మూడు రోడ్ల జంక్షన్ నుంచి ధూళికేశ్వరాలయం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండడంతో తరచూ ఈ సమస్య తలెత్తుతోందని వాహనదారులు చెబుతున్నారు. సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేసి, ట్రాఫిక్ సమస్యను తొలగించాలని కోరుతున్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు

పాలకొండ రూరల్: కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు, పలువురు కార్మికులు స్థానిక నగరపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. కేంద్రం తీసుకువస్తున్న లేబర్ కోడ్‌లు వ్యతిరేకిస్తూ మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. బ్రిటిష్ కాలం నాటి కార్మిక చట్టాలు తీసివేస్తూ కార్మికుల హక్కులు హరించేలా లేబర్ కోడ్‌లు అమలుచేయాలని చూస్తుండడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు విమల శ్రీదేవి, రఘు భాస్కరరావు, ఆంజనేయులు, కార్తీక్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..



మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణిని సన్మానిస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ విభాగం సెక్రటరీగా దాసరి మాధవరావు నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయనకు పార్టీ పదవి కట్టబెట్టినందుకు కృతజ్ఞతగా మండలంలోని చినమేరంగిలో మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజును కలిసి, ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకం ఉంచి, ఈ పదవి కట్టబెట్టారని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల 1988-91 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. చాలా ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో వారంతా ఎంతో ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి తమ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుని సరదాగా గడిపారు.



సత్వరమే ధ్రువపత్రాలు అందివ్వండి

జియ్యమ్మవలస: విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాలను సత్వరమే అందివ్వాలని తహసీల్దారు చిన్నారావు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలతో సోమవారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల అందజేతలో ఎటువంటి జాప్యం వహించరాదన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి ఆలయాభివృద్ధికి అడ్డాపుశిల గ్రామానికి చెందిన అక్కేన తిరుపతిరావు తన తల్లిదండ్రులు కృష్ణ, సింహాచలమమ్మ పేరిట రూ.1,01,116లను విరాళంగా సోమవారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరిస్తుండడం సంతోషమని టీటీడీ సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డి.పారినాయుడు అన్నారు.

రిలే నిరాహార దీక్ష

పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ 01-2019ను అమలు చేయాలని, అన్ని కేటగిరీల్లో ఉద్యోగోన్నతులు కల్పించాలని నాయకులు కోరారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఉద్యోగులకు ఓడీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటుకు చర్యలు



రహదారి మరమ్మతుల కోసం వేసిన మట్టిని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

మక్కువ: మండలంలోని వెంకట భైరిపురం నుంచి డి.శిర్లాం గ్రామానికి వెళ్లే రోడ్డు (సుమారు ఒక కిలోమీటర్) పాడవ్వడంతో ఎమ్మెస్సార్ ఫౌండేషన్ సభ్యులు రోడ్డు ఏర్పాటుకు ముందుకు వచ్చారు. గ్రామ సమీపంలోని కంతపోలమ్మ గుడి నుంచి డి. శిర్లాం వరకు రోడ్డు పాడైంది. దీంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెస్సార్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు స్పందించి రూ. 50 వేలతో రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు రోడ్డు మరమ్మతులకు సంబంధించి సోమవారం మట్టి వేశారు. కార్యక్రమంలో మరడ సాయిరాం, రెడ్డి శ్రీరాం, పాము అప్పలస్వామి, జాగాన శ్రీను, దాసరి వెంకటరమణ, తీళ్ల రామకృష్ణ, జాగాన తిరుపతినాయుడు, గేదెల తిరుపతినాయుడు, గుల్ల సింహాచలం, ఉరిటి సింహాచలం,తంగుడు తవిటినాయుడు పాల్గొన్నారు.